క్లుప్తంగా

అప్రమత్తతతో డెంగీ దూరం



ర్యాలీ చేస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

శాంతిపురం: దోమల బారిన పడకుండా ప్రజలు తగుచర్యలు తీసుకుంటే డెంగీ, విష జ్వరాల పడకుండా ఉండవచ్చని వైద్యాధికారులు చెప్పారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం శాంతిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు ఇళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. ఇంటి వద్ద ఉండే టైర్లు, ఇతరత్రా వాటిల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే దోమల సంతతి పెరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దోమల నిర్మూలనకు ఏ చర్యలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు వంశీకృష్ణ, ప్రసాద్, కుప్పం సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం మదనపల్లె డీవైఈఓ శ్రీరామ్ పురుషోత్తం తనిఖీ చేశారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, టీచర్ల విద్యాబోధన ఎలా ఉందో ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ పాటిస్తున్నారని, ఇదే రీతిలో కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేష్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలు బాగా పండాలని..!



ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో శుక్రవారం అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు పుష్కలంగా కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రతి ఏటా ఆషాఢ మాసంలో అక్కదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా కలసి అక్కదేవతలకు పచ్చ వేశారు. పలు రకాల పుష్పాలు, పసుపు, కుంకుమ, గాజులు, నిమ్మకాయలు పెట్టి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. అన్న సమారాధన చేశారు.

29న వాహనాల వేలం

కుప్పం రూరల్: కుప్పం సెబ్ స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను 29వ తేదీ వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన సోమవారం ఉదయం 10 గంటల లోపు రూ. 5 వేల చెల్లించి పాసులు పొందాలన్నారు. పాసులు పొందిన వ్యక్తులు మాత్రమే వేలంలో పాల్గొనాలన్నారు. వేలానికి ఆధార్, పాన్‌కార్డులతో రావాలని, వాహనం పొందిన తరువాత అదే రోజు నగదుతోపాటు అదనంగా 18 శాతం జీఎస్టీ కట్టాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు కుప్పం సెబ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కృత్రిమ కాళ్ల కొలతల శిబిరానికి స్పందన



శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్: ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల శిబిరానికి విశేష స్పందన లభించిందని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తపోవనం వద్ద ఉన్న రాస్ భవనంలో ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల కోసం విచ్చేశారన్నారు. నియమ, నిబంధనల ప్రకారం అర్హుల కాళ్ల కొలతలను తీసుకోవడం జరిగిందన్నారు. కొలతలు ఇచ్చి అర్హత ఉన్న వారందరికీ త్వరలో కృత్రిమ కాళ్లను ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సావెక్స్ టెక్నాలజీ సంస్థ నిర్వాహకులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

చిత్తూరు అర్బన్: విద్యార్థులకు చట్టాలపై తప్పనిసరిగా కనీస అవగాహన ఉండాలని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ సుబ్బరాజు సూచించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై కలిగే పర్యవసనాలు, పోక్సో ఇతర చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. బాలలపై లైంగిక దాడుల నివారణ కోసం పోక్సో చట్టం రూపొందించారని తెలిపారు. మహిళల రక్షణ కోసం పోలీసుశాఖ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని, ఫిర్యాదు అందిన వెంటనే ప్రతిస్పందిస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా పోలీసులను ఆశ్రయించాలని కోరారు.

ఖరీఫ్.. సాయం ఉఫ్!



వరి నాట్లకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతన్న

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల దాటింది. ఈ సీజన్‌లో రైతులు ప్రధానంగా వరి సాగు ఎక్కువగా చేస్తుంటారు. గత ఐదేళ్లూ అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కింది సీజన్ ప్రారంభానికి ముందే పంట పెట్టుబడికి ఆర్థిక సాయం అందజేసింది. దీంతో రైతులు ఏ ఇబ్బందులూ లేకుండా పంటల సాగుకు పూనుకునేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారంలోకి వస్తే రూ.20వేలు సాయం చేస్తామని ప్రకటించిన చంద్రబాబు ఆ దిశగా చర్యలేవీ తీసుకోకపోవడంతో రైతాంగం ఆశలు అడియాశలయ్యాయి. అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆందోళన చెందుతున్నారు.

- వరి సాగుకు తప్పని కష్టం
- 15 రోజులుగా వరినాట్లు
- రైతులకు అందని సాయం
- హామీ నెరవేర్చని చంద్రబాబు
- ఆశలు అడియాశలేనా? అని వాపోతున్న రైతాంగం

కుప్పం: ఐదేళ్లుగా క్రమం తప్పకుండా వర్షాలు పుష్కలంగా కురవడంతో కుప్పం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు పెరిగింది. దీనికి తోడు 'రైతుభరోసా' కింద ప్రభుత్వ సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. దీంతో రైతులు అప్పులు చేసే పరిస్థితి లేకుండా వ్యవసాయం చేసేవారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.20 వేలు సాయం చేస్తుందని ఆశతో వరి నాట్లకు సిద్ధమయ్యారు. తీరా నెలలు గడుస్తున్నా రూపాయి కూడా విదల్చకపోవడంతో అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితులు కలిగాయని రైతులు వాపోతున్నారు.

నమ్మి మోసపోయిన రైతాంగం

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఒక ఎకరా పొలంలో వరి సాగుకు రూ.20 వేలపైగా వ్యయం చేయాలి. దుక్కి దున్నడం మొదలు వరినాట్ల వరకు డబ్బులు ఖర్చు పెట్టాల్సిందే. దుక్కి దున్నడానికి ట్రాక్టర్ బాడుగ గంటకు రూ.1500, మహిళలకు వరి నాటేందుకు రోజుకు రూ.500, పురుషులకు రూ.800 చొప్పున ఇవ్వాలి. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అయినా రైతు భరోసా ప్రకటిస్తారనే ఎదురు చూపులు చివరకు నిరాశ మిగిల్చాయి.

చాలా ఇబ్బంది పడుతున్నాం

ఇప్పుడున్న కూలీ, ట్రాక్టర్ రేట్లతో వ్యవసాయం చేయలేం. ప్రభుత్వం రైతు భరోసా కింది సాయం చేస్తుందిలే అని ఆశతో వరి నాట్లకు సిద్ధమయ్యా. బ్యాంకు ఖాతాలో నగదు పడితే సెల్‌కు మెసేజ్‌లు వస్తుందని చూసి.. చూసి.. విసిగిపోయాం. వరి నాటకుండా మధ్యలో వదల్లేం. అప్పు చేసి నాటేందుకు అంత స్తోమత లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం.

–చంద్రప్ప, జరుగు , కుప్పం

రైతులకు కష్టాలు తప్పేలా లేవు

వ్యవసాయం చేయాలంటే వేలల్లో ఖర్చు పెట్టాలి. మళ్లీ 10 ఏళ్లనాటి కష్టాలు మొదలయ్యాయి. అప్పులు చేసి వ్యవసాయం చేసినా పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు పలకవు. గత ప్రభుత్వం రైతు భరోసాతో ఆదుకుంది. ఈ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావొస్తున్నా రైతు భరోసాపై ఏలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాబోయే రోజుల్లో రైతులకు కష్టాలు తప్పేలా లేవు.

–అన్నామల్లై, కుప్పం

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ మనోజ్‌రెడ్డి



బైక్ ర్యాలీ చేస్తున్న మాజీ సైనికులు, పట్టణ ప్రజలు

- పలమనేరు నుంచి చిత్తూరుకు మోటార్ సైకిళ్ల ర్యాలీ
- అమర వీరులకు ఘన నివాళి

పలమనేరు: పట్టణంలోని మాజీ సైనికులు, పలు స్వచ్ఛంద సంస్థలు, యువకులు ఘనంగా కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ మనోజ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బైక్ ర్యాలీని జెండా ప్రారంభించారు. జాతీయ పతకాలు మోటార్ సైకిళ్లకు కట్టుకుని పట్టణం నుంచి చిత్తూరుకు ర్యాలీగా వెళ్లి అక్కడ అమరవీరుల స్థూపానికి నివాళుర్పించారు. విశ్రాంత మిలటరీ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ, 1999లో పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధంలో దేశాన్ని గెలిపించి, అమరులైన సైనికులను స్మరిస్తూ ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యువత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని, దీనికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అలాగే దేశంలోని యువతకు విధిగా సైనికశిక్షణ ఇచ్చేలా ప్రభుత్వాలు చట్టాలు తేవాలన్నారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వెంకటేశులు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎఫ్‌ఆర్వో శివన్న, వాణి విద్యాసంస్థల నిర్వాహకులు క్రిష్ణమూర్తి రెడ్డి, సీతారామయ్య, బాస్ నాయకులు ఆకుల గజేంద్ర పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

ఎందరో అమరవీరుల త్యాగఫలం

కుప్పం రూరల్: పలువురు జవాన్లు, ఆర్మీ అధికారుల ప్రాణత్యాగమే కార్గిల్ విజయమని టి. సదుమూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మనాభరాజు అన్నారు. శుక్రవారం హైస్కూలు ఆవరణలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. అమర జవాన్లకు నివాళులు అర్పించారు. అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ, అధికారులు



హాజరైన అభ్యర్థినులు

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పలు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బంగారుపాళెం, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె, పులిచెర్లలోని ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 77మంది అభ్యర్థినులు హాజరయ్యారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఇంటర్వ్యూ చేశారు. ఎంపికైన వారి వివరాలు త్వరలో ప్రకటించనున్నట్టు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డీఎంఅండ్‌హెచ్‌ఓ హనుమంతరావు, సీడీపీఓలు ఇందిరా ప్రియదర్శిని, రాజేశ్వరి, మాధవిలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని బీసీ జాబితాలో చేర్చరూ!

- మంత్రులకు పిరమళైకలర్ కులస్తుల వినతి

పలమనేరు: ఎన్నో దశాబ్దాల క్రితం రాష్ట్రంలో చిరు వ్యాపారాలు చేస్తూ స్థిరపడిన పిరమళైకలర్ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని ఆ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ తేవర్ శుక్రవారం అమరావతిలో రాష్ట్ర బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రులు సవిత, సంధ్యారాణిని కోరినట్లు తెలిపారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఎక్కువ మంది ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, గుంటూరు జిల్లాలో ఉంటున్నారని మంత్రులకు వివరించామన్నారు. మంత్రులను కలిసిన వారిలో కుల సంఘ నేతలు సుప్ప దేవరక్రిష్ణ, నటరాజ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

జమ్ముగుండ్లపల్లెలో వైద్య శిబిరం

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం జమ్ముగుండ్లపల్లెలో వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, విష జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో ముందస్తు జాగ్రత్తగా వైద్య శిబిరం నిర్వహించినట్టు చెప్పారు. పరిసరాల శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. రాత్రి పూట దోమ తెరలు వాడాలన్నారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ వివరించారు.



జమ్ముగుండ్లపల్లెలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



అల్లపల్లెలో వేరుశనగ పంటలో పొలం బడి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, రైతులు

బైరెడ్డిపల్లె: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకుంటే వ్యవసాయం ఖర్చులు తగ్గుతాయని రైతు వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. మండలంలోని అల్లపల్లె, నాచుకుప్పంలో శుక్రవారం వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విత్తనశుద్ధి, విత్తన మోతాదు, ఎరువుల వాడకం, అంతర పంటలపై నాగపద్మిని అవగాహన కల్పించారు. ప్రస్తుతం వేరుశనగ పంట పూత దశలో ఉండటం వలన జిప్సం ఎకరాకు 200 కేజీలు వాడితే దిగుబడి పెరగడంతో పాటు గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. వరి నాటే రైతులు కూడా దుక్కిలో ఎకరాకు 20 కేజీల జింక్ సల్ఫేట్ వాడాలన్నారు. భూసార పరీక్షలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారిణి గీతాకుమారి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలి

పలమనేరు: భూసార పరీక్షల ఆధారంగానే పంటల సాగులో ఎరువులను వాడాలని, మితిమీరిన ఎరువుల వాడకంతో భూమి సమతుల్యత దెబ్బ తింటుందని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. శుక్రవారం మండలంలోని కూర్మాయి రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, వాతావరణ ఆధారిత వ్యవసాయం చేయాలన్నారు. ముఖ్యంగా రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఏడీ అన్నపూర్ణదేవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి ఆలయ ఆవరణలో కనుల పండువగా నిర్వహించారు. గుడివంక ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం ఆవరణలో పచ్చటి తోరణాలతో పందిళ్లు వేసి, విద్యుద్దీపాల అలంకరణతో కల్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేసి వేదికపై కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ, హోమాలు, మంగళవాయిద్యాల హోరు, భక్త జన సందడి నడుమ అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. శనివారం ఆలయ ఆవరణలో రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

29, 30న భరణి, కృత్తిక కావళ్లు

వి.కోట: ఈ నెల 29, 30వ తేదీల్లో భరణి, కృత్తికను పురస్కరించుని మండలంలో నాయకనేరి సమీపంలోని దుర్గం కొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. సోమవారం భరణి కావళ్లు, మంగళవారం ఆడి కృత్తిక కావడి మొక్కులు భక్తులు చెల్లించవచ్చన్నారు. ఇందుకుగాను భక్తులకు అన్ని ఏర్పాట్లు కల్పించనున్నట్టు తెలిపారు. ఆడిమాసం ప్రారంభం నుంచి మండలంలో సుబ్రమణ్యస్వామి భక్తులు కావడి చెల్లింపులకు వెళ్తున్నారు.

29 నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ మునీశ్వరస్వామి కొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు ఆడి కృత్తిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. 29న సోమవారం నడింపల్లె, సూరకుంట్ల, 30న మంగళవారం గొాదమాకులపల్లె, కడపల్లె, 31న బుధవారం నాగిరెడ్డిపల్లె, లింగమనాయునిపల్లె, 1వ తేదీ గురువారం రాగిమాకులపల్లె, తిరుమలకొండయ్యగారిపల్లె, 2న శుక్రవారం చల్లావారిపల్లె, బొంతలవారిపల్లె గ్రామస్తులతో పగలు అభిషేకం, అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను, 30వ తేది పుష్పపల్లకి సేవ వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే భక్తుల కావడి చెల్లింపులు, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.



వి.కోట: కావళ్లతో ఆలయానికి వెళుతున్న భక్తులు

29న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పుంగనూరు: శుభారాం డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 29న నిర్వహించనున్నారు. డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటలకు సమావేశం, గురువులకు సత్కారం కార్యక్రమాలు నిర్వహించి, కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఇవ్వనున్నట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు.

ఎట్టకేలకు దుకాణాలు ఖాళీ



దుకాణాలు ఖాళీ చేయిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం జీవకారుణ్య సత్రానికి సంబంధించిన 8 దుకాణాలను ఎట్టకేలకు దేవదాయశాఖ అధికారులు ఖాళీ చేయించారు. శుక్రవారం రెవెన్యూ, పోలీసులు, దేవదాయశాఖ అధికారుల సమక్షంలో షాపులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈఓ తిమ్మారెడ్డి షాపు వివరాలను వెల్లడించారు. కొంత మంది 2002కు ముందు నుంచి ఈ షాపులను అనుభవిస్తున్నారు. రూ.1000 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. గతంలో పలుమార్లు ఖాళీ చేయాలని దేవదాయశాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. తర్వాత అద్దె ఇవ్వడం కూడా మానేశారు. దీంతో ఏపీ ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ట్రిబ్యునల్ వెంటనే ఆ షాపులను ఖాళీ చేయించాలని ఉత్తర్వులు ఇచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఏసీ ప్రసన్నలక్ష్మి, ఈఓలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వృథా కాదు.. సైనికుల త్యాగం



గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ చేస్తున్న మాజీ సైనికులు



గుడిపాల: మాజీ సైనిక అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

- కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి
- మాజీ సైనికుల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్: కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుల త్యాగం ఎప్పటికీ వృథా కాదు అని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయ్‌శంకర్‌రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్ర అన్నారు. శుక్రవారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి కొత్తబస్టాండ్ వద్ద ఉన్న సైనికుల అమర వీరుల స్థూపం వరకు ర్యాలీ చేశారు. జయహో జవాన్ అంటూ నినదించారు. అనంతరం అమరస్థూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యుద్ధంలో భారత సైనికుల శౌర్యానికి, త్యాగానికి గుర్తు కార్గిల్ విజయ్ దివస్ అని అన్నారు. దేశానికి రక్షణ.. ప్రజలకు భరోసా ఇస్తున్న సైనికుల సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సైనికుల సంక్షేమ సంఘం మాజీ నాయకులు సురేంద్రబాబు, పళని, రఘుపతి, రాజన్, శేఖర్, మాజీ సైనికుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వీరజవాన్ల సేవలు మరువలేనివి

కార్గిల్ యుద్ధంలో పోరాడిన వీరజవాన్ల సేవలు ఎప్పటికీ మరువలేనివని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవన జ్యోతి అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో కార్గిల్ విజయ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సైన్యంలో చేరి దేశానికి సేవలందించాలని పిలుపునిచ్చారు. అనంతరంసేవాభారతి జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప మాట్లాడారు. కార్గిల్ యుద్ధం జరిగిన తీరు, సైనికుల ధైర్యసాహసాలను విద్యార్థులకు వివరించారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, అధ్యాపకులు చెన్నకేశవులు, రాజేష్‌కుమార్, రెడ్డిబాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవీకేఎన్ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి

మాజీ సైనికులకు సన్మానం

గుడిపాల: కార్గిల్ యుద్ధంలో భారత్–పాకిస్తాన్‌పై విజయం సాధించి 25 ఏళ్ల అయిన సందర్భంగా మాజీ సైనికులను ఘనంగా సన్మానించినట్లు మండల బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం కుప్పిగానిపల్లెలో కార్గిల్ విజయ్ దివస్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీనగర్ నుంచి 205 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్గిల్ పట్టణం వద్ద 1999 మే నెల నుంచి జూలై వరకు భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగిందన్నారు. ఈ యుద్ధంలో 527 మంది భారత సైనికులు వీరమరణం పొందారని, 1363 మంది సైనికులు క్షతగాత్రులు అయ్యారన్నారు. చివరకు భారత సైనికులు విజయం సాధించడంతో అప్పటి నుంచి విజయ్ దివస్‌ను ఏటా జూలై 26న జరుపుకుంటామన్నారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన విశ్రాంత సైనిక అధికారులు శేషాద్రికుమార్, సుబ్రమణ్యంను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందిమాధవ, చంద్రబాబు, రవి, సోమనాథ్, దేవ, సాయిప్రతాప్, శేఖర్‌తో పాటు మాజీ సైనికులు పాల్గొన్నారు.